# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 09-06-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **తమ ప్రభుత్వం 11 ఏళ్ల పాలనలో మహిళాభివృద్ధికే అత్యంత ప్రాధాన్యం ఇచ్చిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు.**
2. **ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ప్రాంత మహిళలను కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఖండించారు.**
3. **తెలంగాణ రాష్ట్ర మంత్రులుగా గడ్డం వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వాకిటి శ్రీహరి ప్రమాణ స్వీకారం చేశారు.**
4. **నాణ్యతలో రాజీ పడకుండా అర్హులందరికీ నివాసయోగ్యమైన ఇళ్లు ఇవ్వాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టంచేశారు.**
5. **ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన ఏపీ ఈఏపీసెట్‌లో 75.67 శాతం మంది విద్యార్థులు అర్హత సాధించారు.**

==========================

తమ ప్రభుత్వం 11 ఏళ్ల పాలనలో మహిళాభివృద్ధికే అత్యంత ప్రాధాన్యం ఇచ్చిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. వరుసగా మూడోసారి అధికారం చేపట్టి ఏడాదైన సందర్భంగా ఆయన స్పందిస్తూ… సైన్స్, విద్య, క్రీడలు, అంకుర పరిశ్రమలు, సైన్యం తదితర అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తూ మరింత మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా కొనియాడారు. మహిళా సాధికారతే లక్ష్యంగా ఉజ్వల యోజన, ముద్రా రుణాలు, పీఎం అవాస్ యోజన, బేటీ బచావో బేటీ పడావో వంటి ఎన్నో సంక్షేమ పథకాలను భారతీయ జనతా పార్టీ ప్రవేశపెట్టిందని నరేంద్ర మోదీ తెలిపారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి మహిళలను కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఖండించారు. మహిళల వ్యక్తిత్వంపై దాడిని ఉపేక్షించబోమని స్పష్టంచేశారు. మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఆయన హెచ్చరించారు. పాత్రికేయ విశ్లేషణల పేరుతో రాజధాని అమరావతి మహిళలపై వ్యాఖ్యలు చేయడాన్ని చంద్రబాబు నాయుడు తీవ్రంగా ఖండించారు.

--------------------------

రాజధాని అమరావతి మహిళలపై వ్యాఖ్యలను ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ ఖండించారు. అమరావతిపై వ్యాఖ్యలతో మహిళలను అవమానించారని.. ఈ ప్రాంతంలో విలసిల్లిన బౌద్ధాన్ని అవహేళన చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆ ప్రాంత చారిత్రక, ఆధ్యాత్మిక సంపదను విస్మరించవద్దని... రాజధాని అమరావతి కోసం భూములు ఇచ్చిన వారిలో 32 శాతం ఎస్సీ, ఎస్టీలు, 14శాతం బీసీలు ఉన్నారని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. రాజధానిపై కుట్రలు చేసేవారిపై కఠిన చర్యలు తప్పవని ఉప ముఖ్యమంత్రి సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా హెచ్చరించారు.

---------------------------

తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గంలో కొత్తగా చోటు దక్కించుకున్న ముగ్గురు శాసనసభ్యులు.. మంత్రులుగా పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవనలో నిన్న జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ.రేవంతరెడ్డి సమక్షంలో.. గడ్డం వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వాకిటి శ్రీహరితో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రమాణం చేయించారు. కొత్త మంత్రులకు సీనియర్ మంత్రులు, శాసనసభ్యులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. మరోవైపు నూతన మంత్రులకు 'ఎక్స్' వేదికగా ముఖ్యమంత్రి రేవంతరెడ్డి అభినందనలు తెలిపారు. వారితోపాటు శాసనసభ ఉప సభాపతిగా బాధ్యతలు స్వీకరించనున్న జాటోతు రాంచందర్‌నాయక్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

---------------------------

హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ శాసనసభ్యులు మాగంటి గోపీనాథ్ అనారోగ్యంతో నిన్న కన్నుమూశారు. ఆయన వయసు 62 సంవత్సరాలు. ఈ నెల 5వ తేదీన తీవ్ర గుండెపోటుతో ఆస్పత్రిలో చేరిన ఆయన.. చికిత్స పొందుతూ నిన్న తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. మాగంటి గోపీనాథ్‌ను చివరిసారిగా చూసేందుకు పలు పార్టీల నేతలు, ప్రముఖులు, జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలు, అభిమానులు పెద్ద సంఖ్యలో ఆయన నివాసానికి తరలివచ్చారు. గోపీనాథ్ భౌతికకాయం వద్ద తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంతరెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్‌తోపాటు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, నేతలు నివాళులు అర్పించారు. మహాప్రస్థానంలో ప్రభుత్వ లాంఛనాలతో మాగంటి గోపీనాథ్ అంత్యక్రియలు జరిగాయి.

---------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనికతతో రాష్ట్రాన్ని సంక్షోభం నుంచి గట్టెక్కిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ గృహనిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. విజయవాడలో ఆయన నిన్న మాట్లాడుతూ... గత వైకాపా ప్రభుత్వ హయాంలో గృహనిర్మాణంలో జరిగిన అవకతవకలపై విజిలెన్స్ విచారణ కొలిక్కి వచ్చిందని తెలిపారు. త్వరలోనే తగిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. అర్హులైన వారందరికీ నాణ్యతలో రాజీ పడకుండా నివాసయోగ్యమైన ఇళ్లు ఇవ్వాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంటూ..

..వాయిస్.. 32 సెకన్లు

---------------------------

ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన ఏపీ ఈఏపీసెట్‌లో 75.67 శాతం మంది విద్యార్థులు అర్హత సాధించారు. ఇంజనీరింగ్ విభాగంలో 71.65 శాతం మంది, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో 89.8 శాతం మంది అర్హులయ్యారు. ఈఏపీసెట్ ఫలితాలను ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి

నారా లోకేశ్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా విడుదల చేశారు. ఇంజనీరింగ్‌లో అమ్మాయిలు 73.37 శాతం, అబ్బాయిలు 70.33 శాతం... అగ్రికల్చర్, ఫార్మసీలో అమ్మాయిలు 89.76 శాతం, అబ్బాయిలు 89.92 శాతం అర్హత సాధించారు.

---------------------------

కృష్ణా జిల్లా మచిలీపట్నం మంగినపూడి బీచ్‌లో నాలుగు రోజుల పాటు నిర్వహించిన మసులా ఫెస్ట్-2025 నిన్న ముగిసింది. చివరి రోజు జరిగిన కార్యక్రమంలో క్రీడాకారులకు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ బహుమతులు అందజేశారు. అనంతరం మంత్రి సత్యప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని తెలిపారు. మచిలీపట్నం బీచ్ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని సత్యప్రసాద్ తెలియజేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని అనేక ప్రాంతాల్లో నిన్న ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ తీవ్రత కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఐదు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. బాపట్లలో 42, నర్సాపురంలో 41, ఒంగోలు, కావలి, నెల్లూరులో 40, కాకినాడలో 39 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

కాగా, వాతావరణ అనిశ్చితితో రాయలసీమ, కోస్తాలో పలుచోట్ల పిడుగులు, ఉరుములు, ఈదురుగాలులతో వర్షాలు కురిశాయి. ఈ రోజు, రేపు కోస్తా ప్రాంతంలో ఎండ తీవ్రత కొనసాగి పగటి ఉష్ణోగ్రతలు కొన్నిచోట్ల 40 నుంచి 42 డిగ్రీలు నమోదవుతాయని, పలు ప్రాంతాల్లో పిడుగులతో వర్షాలు కురుస్తాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

---------------------------

పదవ తరగతి, ఇంటర్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులను ప్రోత్సహించడానికి షైనింగ్ స్టార్స్ అవార్డు-2025 పేరిట సత్కరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ఈ రోజు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా, పార్వతీపురం మన్యం జిల్లాలో నిర్వహించే కార్యక్రమానికి విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ హాజరవుతారు. విద్యలో నాణ్యత, నైపుణ్యాలను ప్రోత్సహించే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా 4 వేల 168 మంది పదవ తరగతి విద్యార్థులకు.. ప్రభుత్వ, ప్రైవేట్ మేనేజ్‌మెంట్ కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, హెచఈసీ, సీఈసీ, ఎంఈసీ, ఒకేషనల్ విభాగాల్లో అత్యధిక మార్కులు సాధించిన 920 మంది ఇంటర్ విద్యార్థులను ఈ అవార్డులకు ఎంపిక చేశారు. ప్రతి అవార్డు గ్రహీతకు పతకం, రూ.20 వేల నగదు బహుమతి, సర్టిఫికెట్‌తో సత్కరించనున్నారు.

---------------------------

గత ప్రభుత్వం అన్ని వ్యవస్థలనూ అస్తవ్యస్తం చేసిందని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధినీ దారి మళ్లించిందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా అమలు చేసే కార్యక్రమాలను పునరుద్ధరిస్తామని తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో పిఠాపురానికి చెందిన 325 మంది ప్రైవేటు ఎలక్ట్రీషియన్లతో నిన్న ఆయన సమావేశమయ్యారు.

=====================